సాక్షి వైఎస్సార్ జిల్లా

సోమవారం । 26 । ఆగస్టు । 2024



ఆధిక్యంలో చిత్తూరు జట్టు

ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. చిత్తూరు జట్టు ఆధిక్యంలో కొనసాగుతోంది. -8లో



జిల్లాలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు, సిబ్బంది కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.6/27.4

జిల్లాలో ఆదివారం 27.4 - 34.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్



కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది భద్రత ..సౌకర్యాలపై 'సాక్షి' క్యాంపెయిన్.

భద్రత పెంచాలి



పనిచేస్తున్న ప్రదేశంలో, విధులకు వెళ్లి,వచ్చే మార్గంలో భద్రత పెంచాల్సిన అవసరం ఉంది. అలాగే పని చేసే సమయంలో సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాల్సిందే. అధికారులు, సహచర వైద్య సిబ్బంది ఎవరైనా ఆపదలో ఉంటే ఒకరినొకరు కాయశక్తులా రక్షించేందుకు ముందుకు రావాలి. – బి. వరలక్ష్మి, స్టాఫ్ నర్స్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్), కడప

రక్షణ కల్పించాలి



ఏ రంగంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకైనా, చదువుకుంటున్న విద్యార్థులకైనా అధికారులు, పోలీసులు రక్షణ కల్పించడం బాధ్యతగా భావించాలి. చిన్న, పెద్దా తారతమ్యం లేకుండా మహిళలందరికీ ఆసుపత్రిలో విధులను నిర్వహించే సమయంలో సెక్యూరిటీ వారు ప్రత్యేకంగా రక్షణ కల్పించాలి. – టి. మహబూబ్‌చాన్, ఎఫ్.ఎన్.ఓ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్), కడప

నిఘాతో పాటు పెట్రోలింగ్ అవసరం



మహిళా డాక్టర్స్, వైద్య విద్యార్థులు పకడ్బందీగా విధులను నిర్వహించాలంటే భద్రత కోసం తప్పనిసరిగా వారు పనిచేస్తున్న ప్రదేశాలలో, అన్ని సమయాలలో సీసీ కెమెరాలు, సెక్యూరిటీ వారి నిఘా అవసరం. వారితో పాటు పోలీస్ పెట్రోలింగ్ కూడా ఏర్పాటు చేయడం మరింత రక్షణగా ఉంటుంది. – డాక్టర్ ఎం.సురేశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, రిమ్స్, కడప

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



విధి నిర్వహణలో ఉండే మహిళా డాక్టర్, వైద్య సిబ్బందికి పూర్తి స్థాయిలో భద్రత కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలి. అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి మానిటరింగ్ చేయాలి. నైట్ డ్యూటీ చేసే వారికి పూర్తిస్థాయిలో భద్రత కల్పించాలి. – నూర్జహాన్, ఏఎన్ఎం, ఆకేపాడు పీహెచ్‌సీ,రాజంపేట

న్యూస్‌రీల్

పొట్టి..మహా గట్టి



పుంగనూరు జాతి ఆవు

మదనపల్లె సిటీ: అరుదైన పుంగనూరు జాతికి చెందిన ఈ ఆవు చూసేందుకు పొట్టిగా కనిస్తుంది. మదనపల్లె పట్టణం గోవర్ధనగిరిలోని శ్రీకృష్ణ ఆలయంలో దాతలు పుంగనూరు పొట్టి ఆవులను గోదానం చేశారు.వీటి కోసం ప్రత్యేకంగా గోశాల ఏర్పాటు చేశారు. ప్రతి రోజు భక్తులు ఆవులకు పూజలు నిర్వహిస్తున్నారు.

28న భూ బాధితుల రాష్ట్ర సదస్సు



గోడ పత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కబ్జాదారుల కబంధహస్తాల నుంచి భూమిని విముక్తి చేసి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని కోరుతూ ఈ నెల 28న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర సదస్సుకు సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్ నాగ సుబ్బారెడ్డి, వెంకట శివ, పి.చంద్ర శేఖర్, కే.సి.బాదుల్లా, కే.శివశంకర్, చంద్ర అరుణ్ తేజ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



జావెలిన్ త్రో విసురుతున్న క్రీడాకారిణి

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఆదివారం బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్- 14, 16 బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలు క్రీడాకారుల మధ్య ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలలో 300 మందిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులను సెప్టెంబరులో 14, 15, 16 తేదీల్లో గుంటూరు ఆచార్య నాగార్జున యనివర్సిటీలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ పోటీలను వ్యాయామ సంచాలకులు వెంకటసుబ్బయ్య, సునీల్, శివారెడ్డి, ఎర్రన్న, రాఘవేంద్ర, అంకారావు, నాగేశ్వరరావు, బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ కార్యదర్శి అహమర్‌బాష తదితరులు పర్యవేక్షించారు.

కడపలో చదరంగం పోటీలు



చదరంగం పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: కడప నగరం పాలెంపాపయ్యవీధిలోని చదరంగం హాల్‌లో ఆదివారం నిర్వహించిన 20వ అష్రఫ్–ప్రసన్న మంత్లీ రోలింగ్ ట్రోఫీ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగింది. ఈ టోర్నమెంట్‌ను జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి. అనీస్‌దర్బారీ ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో నూకల జశ్వంత్ విజేతగా నిలువగా, రెండోస్థానంలో జతిన్, మూడోస్థానంలో ప్రభుదేవా నిలిచారు. తర్వాత స్థానాల్లో స్టాలిన్, స్పందన్, ఉమాదేవి, నవీన్, దివ్యాన్షి, దీపిక, తన్మయ్‌కాంత్ నిలిచారు. వీరికి నిర్వాహకులు ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్ శ్రీకాంత్, కోచ్ తబస్సుమ్ పాల్గొన్నారు.

పారిశుధ్యం మమ.. విజృంభిస్తున్న దోమ!

● చాపకింద నీరులా డెంగీ జ్వరాలు ● వేసవి వాతావరణంలోనూ 'టైగర్'స్వైర విహారం ● పూర్తిగా పడకేసిన పారిశుధ్యం

నాలుగు రోజులుగా..



జ్వరంతో బాధపడుతున్న ఈమె పేరు హసీనా. ఊరు చింతకొమ్మదిన్నె మండలంలోని బుగ్గలేటిపల్లె. నాలుగు రోజుల క్రితం జ్వరంతో రిమ్స్‌కు వచ్చింది. ఈనెల 23న వైద్యులు రక్తపరీక్షలు చేశారు. ప్రస్తుతం ఇక్కడే అడ్మిట్‌లో ఉండి చికిత్స తీసుకుంటోంది. బేల్దారి పని చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే భర్త పనులొదిలేసుకుని ఈమెకు తోడుగా ఉంటున్నాడు.

వాంతులు విరేచనాలతో..




జ్వరంతో అల్లాడుతున్న ఈమె పేరు సూర్యనారాయణమ్మ. ఆ పక్కన ఉన్న మనవడి పేరు నవీన్. తన జేజికి జ్వరంతో పాటు వాంతులు, విరేచనాలు అవుతుండడంతో ఈనెల 23న ప్రొద్దుటూరు జిల్లా అసుపత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తీసుకొచ్చాడు. జ్వరం తగ్గింది. రక్తపరీక్షలు రిపోర్టులు రావాల్సి ఉంది. ఇక్కడ ఇంకా ఎన్ని రోజులు ఉండాలనేది రిపోర్ట్ ఫలితాలు వచ్చిన తరువాతే చెబుతామంటున్నారని నవీన్ తెలిపాడు.



కడప రిమ్స్‌లో జ్వరాలతో చికిత్స పొందుతున్న రోగులు

రిమ్స్‌లో పెరుగుతున్న జ్వర బాధితులు

జిల్లా వ్యాప్తంగా జ్వరాలతో బాధితులు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. కడప రిమ్స్ ఓపీకి ఈనెల 23, 24 తేదీలలో కేవలం రెండు రోజుల్లోనే 12 మంది పురుషులు, 22 మంది మహిళలు జ్వరాలతో బాధపడుతూ వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.



బాబోయ్ టైగర్ దోమ..

డెంగీ.. ఈ పేరు వింటేనే జనాలు హడలెత్తిపోతున్నారు. మంచి నీళ్లలో జీవించి, పగటి పూట కుట్టే 'టైగర్' దోమ కారణంగా డెంగీ జ్వరాలు వస్తాయి. కంటి గుడ్లు నొప్పులుగా ఉంటాయి. జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వాంతులు అవుతాయి. విరేచనాలు కూడా కావచ్చు. ఇది డెంగీ జ్వరం లక్షణం. డెంగీ జ్వరం ఎప్పుడైనా రావడానికి ఆస్కారం ఉంది.

కడప రూరల్/అర్బన్: జిల్లా వ్యాప్తంగా మే నెలలో కురిసిన వర్షాలకు మొదలైన సీజనల్ వ్యాధులు ఇప్పటికీ ఆగడం లేదు. చినుకు జాడ కనిపించకుండా పోయినా.. జ్వరాలు మాత్రం వణికిస్తూనే ఉన్నాయి. డెంగీ.. టైఫాయిడ్.. తదితర వైరల్ ఫివర్స్ చాపకింద నీరులా నమోదవుతూ.. జనాలను కలవరపాటుకు గురి చేస్తున్నాయి. దీనికి తోడు పారిశుధ్యం పూర్తిగా పడకేయడంతో ఇంటికొకరు జ్వర పీడితులు కనిపిస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రారంభంలో అధికారిక లెక్కల కంటే అనధికారికంగా ఎక్కువ కేసులు వెలుగు చూశాయి. ఆపై కలుషిత నీరు తదితర కారణాల వల్ల డయేరియా కేసులు అధిక సంఖ్యలో నమోదయ్యాయి. మొదటి నుంచి ఇప్పటివరకు డెంగీతోపాటు డెంగీ లక్షణాలతో ఉండే జ్వరాల కేసులు అధికంగా వెలుగు చూస్తున్నాయి.

● సాధారణంగా మనిషి రక్తంలో దాదాపు 2 నుంచి 4.50 లక్షల కణాలు (ప్లేట్ లేట్స్) ఉంటాయి. ఈ జ్వరం వస్తే ప్లేట్ లెట్స్ సంఖ్య తగ్గుతుంది. ఫలితంగా తీవ్ర అనారోగ్యానికి గురి అవుతారు. ఈ తరుణంలో సదరు రోగికి రక్తంలో ప్లేట్ లెట్స్‌ను ఎక్కించాల్సి ఉంటుంది.

'సీరం ఎలీసా' పరీక్షల ద్వారా నిర్ధారణ

వైద్య ఆరోగ్య శాఖ అధికారికంగా సీరం ఎలీసా పరీక్షల ద్వారా డెంగీని నిర్ధారిస్తారు. ఈ పరీక్షలను కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి, పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తారు. కాగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇలా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 'ర్యాపిడ్ కిట్స్'ద్వారా డెంగీ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల్లో పాజిటివ్ వస్తే మళ్లీ 'సీరం ఎలీసా' పరీక్షల ద్వారా నిర్ధారణ చేస్తారు.

డెంగీతో ఆర్థికభారం

సాధారణంగా ప్రైవేట్ ల్యాబొరేటరీలలో డెంగీకి కేవలం రక్త పరీక్షలకే రూ. 500 నుంచి రూ 1000 వరకు వసూలు చేస్తున్నారు. అదే సదరు వ్యక్తి పరిస్థితి తీవ్రత కారణంగా హాస్పిటల్‌లో అడ్మిట్ అయితే 5 రోజులకు దాదాపు రూ. 20 వేలకు పైగా అవుతుంది. అదే ఆ వ్యక్తికి ప్లేట్ లెట్స్ ఎక్కించాలంటే ఒక రోజుకు రూ. 10 వేల వరకు అవుతుంది. ఒక వేళ ఆ వ్యక్తి ఐసీయూలో ఉంటే ఏడు రోజులకు హాస్పిటల్‌కు సంబంధించి అన్ని ఫీజులను కలుపుకుంటే రూ. 70 వేలకు పైగా అవుతుంది. కాగా దీనిలో మరణాలు అరుదుగా సంభవిస్తాయని వైద్యులు అంటున్నారు.

పరిశుభ్రత పడకేయడంతోనే...

చినుకుల రాకతో సీజనల్ వ్యాధుల కాలం కూడా మొదలవుతుంది. దీంతో నిద్రావస్థలో ఉన్న దోమలు బలాన్ని పుంజుకుంటాయి. దీనికి తోడు పరిసరాల అపరిశుభ్రత కారణంగా జలుబు, దగ్గుతో కూడిన వైరల్ ఫీవర్స్ సంక్రమిస్తాయి. అలాగే తాగునీరు కలుషితం కావడం, ఇతర కారణాల వల్ల డయేరియా వస్తుంది. వీటన్నింటికీ ప్రధాన కారణం పరిశుభ్రత లోపించడమే. జిల్లాలో పారిశుధ్యం పడకేసింది. దీంతో దోమలు కుప్పలు కుప్పలుగా పుట్టుకొస్తున్నాయి.

జనవరి నుంచి ఇప్పటివరకు అధికారికంగా నమోదైన కేసుల వివరాలు

మలేరియా	11
డెంగీ	244
డయేరియా	2599
టైఫాయిడ్	219

అన్ని చర్యలు చేపడుతున్నాం



సీజనల్ వ్యాధులను అరికట్టడానికి అన్ని చర్యలు చేపడుతున్నాం. అందులో భాగంగా ఫీవర్స్‌పై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నాం. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ సీజన్‌లో దోమలు కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలి. అలాగే కాచి వడబోసిన మంచి నీటిని తీసుకోవాలి. సీజనల్ వ్యాధులు నియంత్రణలోనే ఉన్నాయి. – డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, కడప

రక్త పరీక్షలు చేయిస్తున్నాం



జిల్లా నలుమూలల నుంచి ఎవరైనా జ్వరంతో బాధపడుతూ వస్తే ఓపీలో వైద్య పరీక్షలను చేయిస్తున్నాం. రెండు లేక ఎక్కువ రోజుల నుంచి జ్వరాలతో బాధపడుతూ రిమ్స్‌కు వస్తే వారికి రక్తపరీక్షలు తప్పనిసరిగా చేయిస్తున్నాం. అన్ని రకాల జ్వరాలకు సంబంధించి వైద్య సేవలను రిమ్స్‌లో అందిస్తున్నాం. మందులు అన్నీ ఉన్నాయి. – డాక్టర్ వై. శ్రీనివాసులు, ఆర్ఎంఓ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్), కడప

◆ బుగ్గవంక చూడరూ!



చెత్తాచెదారం, జంబుతో నిండిపోయిన బుగ్గవంక

కలమల్లకు కొత్త వెలుగు

● తెలుగు శాసనాన్ని పరిశీలించిన కలెక్టర్ శివశంకర్

● ఈ నెల 29న కలమల్లలో తెలుగుభాషా దినోత్సవం



కలమల్లలో ఉన్న తొలి తెలుగు శాసనం



కలమల్ల గ్రామంలో ఉన్న తెలుగు శాసనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

ఎర్రగుంట్ల/కడప కల్చరల్: జిల్లాలో తొలి తెలుగు శాసనం లభించిన కలమల్లకు కొత్త వెలుగు రానుంది. ఎర్రగుంట్ల మండల పరిధిలోని కలమల్ల గ్రామంలోని శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయంలో ఈ శాసనం ఉంది. క్రీ.శ 575 లో రేనాటి చోళరాజు ధనుంజయ శర్మ వేయించిన తొలి తెలుగు శాసనమిది. ప్రాచీన లిపి ఆధారంగా భారతీయ పురావస్తు శాఖ ప్రప్రథమ తెలుగు శాసనంగా దీనిని అంగీకరించింది. తొలి తెలుగు శిలా శాసనం విశిష్టతను భావి తరాలకు తెలియజేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐదవ తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలోనూ దీని గురించి పొందుపరిచింది. ఇంతటి గొప్ప చరిత్ర కల్గిన శాసనాన్ని అందరూ తిలకించే విధంగా తమ గ్రామంలోని దేవాలయాన్ని ఆకర్షణీయమైన మందిరంగా తీర్చిదిద్ది శాసనానికి భద్రతకు మినీ మ్యూజియంను ఏర్పాటు చేసి భద్రపరచాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక ఏర్పాట్ల పరిశీలన

తెలుగుభాష దినోత్సవాన్ని ఒక పండుగలాగా నిర్వహించాలని కలెక్టర్ శివశంకర్ ఇప్పటికే అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలమల్ల గ్రామంలో ఉత్సవాలు జరపనున్నట్లు ఇదివరకే వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం కలమల్ల గ్రామంలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఉన్న తెలుగు శాసనాన్ని ఆయన పరిశీలించి మీడియాతో మాట్లాడారు. ఎక్కడైతే మొదటి తెలుగు శాసనం ఉందో అక్కడే తెలుగుభాష దినోత్సవం నిర్వహించాలనుకున్నాని వెల్లడించారు. కలమల్లలో తెలుగు భాష దినోత్సవాలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. విద్యా, పంచాయతీరాజ్, ఎండోమెంట్, ఇంటాక్ సహకారంతో పెద్ద ఎత్తున తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నాటక ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, రచయితలకు సన్మానం వంటివి ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

> ప్రభుత్వం మీకు నెలనెలా జీతమిస్తోంది. ప్రజలెందుకు మీకు లంచం ఇవ్వాలి. లంచం కోసమే ఎందుకు పీడిస్తున్నారు. మీ డ్యూటీ మీరు చేయండి. మీరంతా లంచం తీసుకోమంటూ వేంకటేశ్వర స్వామి పటంపై ప్రమాణం చేయండి.
> - ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

> కడప నగరంలో గుండాలు, దాదాలు అనుకునే వారంతా సాయంత్రం వేళల్లో రోడ్లపైకి వచ్చి కుర్చీలు వేసుకొని కూర్చుంటూ ప్రజల్ని భయభ్రాంతుల్ని చేస్తున్నారు. మీ అందరికి చిన్నపాటి విన్నపం. మీరు ఇట్లాంటి చేష్టలు మానుకొని మీ ఇళ్లల్లో కుర్చీలు వేసుకొని కూర్చోండి. మీ మీటింగులు ఇళ్లల్లో పెట్టుకోండి. వీధుల్లోకి వచ్చి పెద్ద పోటుగాళ్లని ఫీల్ అవుతున్నారేమో. వీపులు విమానం మోత మోగుతాయి.
> - మీడియా సమావేశంలో కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి

చిత్తశుద్ధి లేమి!

● ప్రొద్దుటూరు, కడప ఎమ్మెల్యేల తీరుతో విస్తుపోతున్న జనం

● రిజిస్ట్రార్ ఆఫీసులో అధికారులతో ప్రమాణం చేయించిన వరద

● ఇసుక అక్రమరవాణాలో బిజీబిజీగా వరద కుటుంబ సభ్యులు

● కడపలో దాదాగిరి చేస్తోంది పచ్చ నేతలే

సాక్షి ప్రతినిధి, కడప: కడప, ప్రొద్దుటూరు ఎమ్మెల్యేల తీరు గురివింద సామెతను గుర్తుకు తెస్తోందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఎదుటివారికి చెప్పేందుకే నీతులన్నట్లు ప్రవరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. వాస్తవ పరిస్థితులు అందుకు దర్పంగా నిలుస్తున్నాయి. అధికారులు లంచాలు తీసుకోకుండా పనిచేయాలని డిమాండ్ చేయడంలో తప్పు లేదు. ప్రజల శ్రేయస్సు దృష్ట్యా ప్రజాప్రతినిధిగా వరదరాజులరెడ్డి చర్య అభినందనీయం .ఆచరణలో చిత్తశుద్ధి ప్రదర్శిస్తే మరింత స్ఫూర్తిదాయకంగా ఉండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు అక్రమార్జన కోసం అర్రులు చాస్తున్నారు. ఇసుకను విచ్చలవిడిగా అక్రమరవాణా చేస్తున్నారు. శుక్రవారం రాత్రి ఎన్‌వీఆర్‌ఆర్ పేరుతో ఉన్న 8 టిప్పర్లు పోలీసులకు పట్టుబడ్డాయి. ఆ టిప్పర్లు వరదరాజులరెడ్డి కుటుంబసభ్యులవేనని ప్రొద్దుటూరు వాసులు బాహాటంగా చెప్పుకుంటున్నారు. అలాంటప్పుడు అధికారుల లంచాలపై మాట్లాడే నైతిక హక్కు ఎలా వస్తుందని పలువురు నిలదీస్తున్నారు. అధికార పార్టీ పేరు చెప్పుకొని పచ్చ నేతలు రేషన్‌షాపులల్లో యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. ప్రొద్దుటూరు కేంద్రంగా చోటు చేసుకున్న పరిణామాలు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి నైతికతను ప్రశ్నిస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

కడపలో దాదాగిరీ తమ్ముళ్లదే

జిల్లా కేంద్రమైన కడప ప్రశాంతంగా, శాంతిభద్రతలు అదుపులో ఉండాలని పౌరులంతా కోరుకోవడం సహజం. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. దౌర్జన్యాలు, భూ ఆక్రమణలన్నీ పచ్చ నేతల చుట్టే తిరుగుతున్నాయి. 30ఏళ్లుగా వ్యాపారం చేస్తున్న ఓ మద్యం వ్యాపారీ నుంచి ఎర్రముక్కపల్లె, కోటిరెడ్డిసర్కిల్‌లో ఉన్న రెండు బార్లు దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్నారు. ఇదంతా ఎమ్మెల్యే మాధవీరెడ్డి అనుచరులైన తెలుగుతమ్ముళ్లు చేసిందే. మరోవైపు భూ షటిల్‌మెంట్లు, రేషన్ షాపుల వ్యవహారం, గ్రావెల్ అక్రమ తరలింపు, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే చర్యలకు పాల్పడడం తదితర విషయాలన్నింటిపై అధికారపార్టీ వైపే వేళ్లు చూపిస్తున్నాయి. కడపలో ఎప్పుడూ లేని సంస్కృతి తెరపైకి వస్తోంది. వ్యాపారులు బెంబేత్తుతున్నారని పలువురు వాపోతున్నారు. ఎమ్మెల్యేగా స్వయంగా రోడ్లపై కూర్చున్న వారికి ఓ విన్నపంటూ బెదిరింపులకు దిగిన ఓ వీడియో తాజాగా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఎక్కడైనా చిన్న ఫిర్యాదు ఉందా? కచ్చితమైన సమాచారం లేకుండా హెచ్చరికలు చేయడాన్ని పలువురు తప్పుబడుతోన్నారు. ఎవరో ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తే నియంత్రించాల్సింది ఎవరు? వ్యవస్థలను చేతులోకి తీసుకొని ఇష్టారాజ్యంగా స్టేట్‌మెంట్లు ఇవ్వడం ఏమిటని పలువురు నిలదీస్తున్నారు. చిత్తశుద్ధితో చేసే పనికి ఎప్పటికీ ప్రజామద్దతు ఉంటుంది. అలా కాకుండా బాధ్యతలేమితో వ్యవహరిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని పలువురు హెచ్చరికలు చేస్తున్నారు.

కోల్‌కతా ఘటన అమానుషం



ప్రజలు ప్రాణాలను కాపాడే డాక్టర్ల ప్రాణాలకే రక్షణ లేకుండా పోతోంది. కోల్‌కతా ఘటన అమానుషం. నిందితులనే వెంటనే కఠినంగా శిక్షించాలి. మహిళా డాక్టర్లు, ఆరోగ్యసిబ్బంది రాత్రిపూట విధులు నిర్వర్తించే సమయంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలి. ప్రధానంగా ఆసుపత్రి ప్రాంగణంలో మద్యం మత్తులో ఉండే వారిని, ఇతరులను అనుమతించకుండా సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలి.

-సునీల్ కుమార్ నాయక్, వైద్యుడు, సంబేపల్లె మండలం దేవపట్ల పీహెచ్‌సీ



మనోధైర్యం దెబ్బతింటోంది



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం సంఘటన చాలా బాధాకరం. ఇలాంటి సంఘటనలతో వైద్యసిబ్బంది మనోధైర్యం దెబ్బతింటోంది. ఆస్పత్రుల్లో భద్రతా పరమైన చర్యలు చేపట్టి ప్రతి ఒక్కరికి అవగాహన పెంచాలి.

-ఉమామహేశ్వరిదేవి, ఏఎన్‌ఎం, మైసూరావారిపల్లి సచివాలయం, రైల్వేకోడూరు

పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి



ప్రభుత్వ ఆస్పత్రులలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి. వాచ్‌మెన్ 24 గంటలు ఉండేలా చూడాలి. అలాగే అన్ని విభాగాలలో సీసీ కెమెరాలు అమర్చాలి. అన్ని సమయాల్లో వైద్య సేవలు అందించే మాకు రక్షణ లేక పోవడం బాధాకరం. ఇలాంటి వారిపై చర్యలు తీసుకొంటే ఇతరులు మర్యాదగా ప్రవర్తిస్తారు.

-నాగిశెట్టి రాధాదేవి, స్టాఫ్ నర్సు, అనంతరాజుపేట పీహెచ్‌సీ, రైల్వేకోడూరు

క్లుప్తంగా

రైతు భరోసా కేంద్రం కూల్చివేత



నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని దృశ్యం

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని చెన్నమరాజుపల్లె గ్రామంలో నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని శనివారం రాత్రి జేసీబీతో కూల్చివేశారు. సురేష్‌కు చెందిన ఈ స్థలాన్ని గతంలో కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకున్నారు. ఈ పత్రాల ఆధారంగా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. గత ప్రభుత్వంలో సుమారు రూ.15 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం రూ.8లక్షల వరకు పనులు పూర్తి చేశారు. గ్రామంలోని గ్రామ సచివాలయం పక్కనే రైతు భరోసా కేంద్రం నిర్మాణంలో ఉంది. కాగా పిల్లర్స్ వరకు నిర్మించిన నిర్మాణాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఎవరు గొడవలకు దిగవద్దని పోలీసులు హెచ్చరించారు. సంబంధిత ప్రభుత్వ అధికారులు సమస్యను పరిశీలించారు. ఫ్యాక్షన్ సీఐ భాస్కర్‌రెడ్డి సంఘటనపై విచారించారు.

ఇసుక రీచ్‌లను పరిశీలించిన కలెక్టర్



చిత్రావతి నదిలో ఇసుక రీచ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

కొండాపురం : ఏటూరు గ్రామ సమీపంలోని చిత్రావతి నదిలో ట్రాక్టర్‌లో ఇసుకను కూలీలతో లోడింగ్ చేసే పాయింట్లను జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం పరిశీలించారు. ఏటూరు, పి.అనంతపురం స్టాక్ ఇసుక పాయింట్‌లలో ఇసుక ఎంత నిల్వ ఉందని అధికారులను ఆరా తీశారు. వినియోగదారులకు నాణ్యమైన ఇసుక అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. పెంజి అనంతపురం, ఏటూరు ఇసుక పాయింట్లల్లో ఇసుక పొందేందుకు తాళ్లప్రొద్దుటూరు, కొండాపురం గ్రామ సచివాలయాల్లో బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సోమవారం నుంచి ఇసుక పాయింట్లల్లో వినియోగదారులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఇసుక పాయింట్ల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి, మైనింగ్, జీఎస్ ఎస్ఎస్ అధికారులు, కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ, ఎస్ఐలు జి. హృషికేశవరెడ్డి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

భూమి కోసం ఘర్షణ

కాశినాయన : మండలంలోని సిద్దాయపల్లె గ్రామానికి చెందిన దొన్నెపాటి నరసింహులు, గొడ్లవీటి ఈశ్వర్‌లు భూమి ఆస్తి విషయమై ఘర్షణ పడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు అవ్వగారి ఆస్తి విషయమై శనివారం అర్ధరాత్రి సమయంలో నరసింహులు, ఈశ్వర్‌లు గొడవపడి కర్రలతో కొట్టుకున్నారు. నరసింహులుకు గాయాలు కావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈశ్వర్, శానం రాజులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్



కడప ఒన్‌టౌన్ పరిధిలో తనిఖీలు చేస్తున్న సీఐ



ప్రొద్దుటూరు సబ్ డివిజన్ పరిధిలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

- రికార్డులు లేని 86 ద్విచక్ర వాహనాలు, 3 కార్లు, 8 ఆటోలు స్వాధీనం
- రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లకు కౌన్సిలింగ్
- అనుమానితులు, పాత నేరస్తుల ఇళ్లలో తనిఖీలు
- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక

కడప అర్బన్ : జిల్లా ఎస్పీ వి. హర్షవర్దన్ రాజు ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. తనిఖీల్లో రికార్డులు లేని 86 ద్విచక్ర వాహనాలు, 3 కార్లు, 8 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత నేరస్తులు, అనుమానితుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి, అనుమానితుల సమాచారాన్ని డయల్ 100 ద్వారా పోలీస్ శాఖకు సమాచారం అందించాలని సూచించారు.

■ కడప సబ్ డివిజన్ కడప ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రముక్కపల్లిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి రికార్డులు లేని 21 మోటార్ సైకిళ్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కడప టూటౌన్ పరిధిలోని మాసాపేట, గౌస్ నగర్‌లలో నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో 9 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. రౌడీషీటర్లకు, ట్రబుల్ మాంగర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

■ ప్రొద్దుటూరు సబ్ డివిజన్ ప్రొద్దుటూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అమృతానగర్‌లో నిర్వహించిన నాకాబందీలో రికార్డులు లేని 42 ద్విచక్ర వాహనాలు, 3 కార్లు, రెండు ఆటోలు స్వాధీనం చేసుకున్నారు.

■ మైదుకూరు సబ్ డివిజన్ మైదుకూరు అర్బన్ పీఎస్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో రికార్డులు లేని 14 ద్విచక్ర వాహనాలు, ఐదు ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. రౌడీషీటర్లకు, ట్రబుల్ మాంగర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

■ జమ్మలమడుగు సబ్ డివిజన్ తాళ్ల ప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని టి. కోడూరు గ్రామంలో పలువురు ఫ్యాక్షనిస్టుల ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు చేసి కౌన్సిలింగ్ నిర్వహించారు.

మహిళా సాధికారతతోనే కుటుంబాల ఆర్థిక పరిపుష్టి

కలెక్టర్ శివశంకర్ లోతేటి



మెగాచెక్కు అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్ : మహిళా సాధికారత సాధనతోనే కుటుంబాల ఆర్థిక పరిపుష్టితోపాటు సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుందని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఆదివారం మహారాష్ట్రలోని జెల్గావ్ నుంచి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'లఖ్ - పతి దీదీ' కార్యక్రమం కింద మహిళలను సత్కరించే కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో దేశ వ్యాప్తంగా దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శివశంకర్ లోతేటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సాధికారత సాధనతోనే కుటుంబాల ఆర్థిక పరిపుష్టితోపాటు సమాజం ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. మహిళల స్వయంసమృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి మహిళా సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదిగి లక్షాధికారి కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందించిన లక్ష రూపాయల రుణాన్ని సద్వినియోగం చేసుకుని తమకు నైపుణ్యం ఉన్న రంగంలో యూనిట్లను ప్రారంభించి జీవనోపాధి పెంచుకునేలా చూడాలన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 1,07,972 పొటెన్షియల్ లఖ్‌పతి దీదీలకు రుణ సదుపాయాలు కల్పించేందుకు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో చివరగా 6479 మంది పొటెన్షియల్ లఖ్ పతి దీదీలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఎల్‌డీఎం జనార్దనం, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలపై కూటమి ప్రభుత్వం గొప్పలు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి



కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో గ్రామ సభలు కొత్తగా జరుపుతున్నట్లు కూటమి ప్రభుత్వం గొప్పలు పోతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పోచిమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సభలు ఎప్పటినుంచో జరుగుతున్నాయని, ఇప్పుడు కొత్తగా ఏమీ జరగడం లేదన్నారు. గ్రామాలకు సంబంధించిన పనులను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడానికి సర్పంచ్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీల ఆధ్వర్యంలో ఈ సభలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలోని 95 శాతం స్థానిక సంస్థలు వైఎస్సార్‌సీపీ ఆధీనంలో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు ఏ పదవి లేకపోయినా పచ్చ కండువాలు కప్పుకొని గ్రామ సభల్లో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని, ఇదే వారు తీసుకొచ్చిన మార్పు అని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన మూడున్నర నెలల్లోనే కూటమి ప్రభుత్వం రూ.13వేల కోట్లు అప్పులు చేసిందన్నారు. పెన్షన్లు, ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం తప్పా ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చి ఉంటే విద్యాకానుక, విద్యాదీవెన, అమ్మ ఒడి, రైతు భరోసా, మత్స్యకార భరోసా వంటి పథకాలు ఇప్పటికే అమలై ఉండేవన్నారు. మూడు నెలల్లో ఈ ప్రభుత్వం చేసిందేమిటంటే వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలు చేయడం, వేధించడం, టీడీపీ, జనసేన నాయకులు వారిలో వారే కొట్టుకోవడం మాత్రమే చేశారన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ప్రభుత్వం అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జి. శ్రీనివాసులరెడ్డి, సీహెచ్ వినోద్ కుమార్, శివకుమార్‌రెడ్డి, షఫీ, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మత విద్వేష వ్యాఖ్యలకు నిరసన



ర్యాలీగా ఏడురోడ్ల కూడలికి చేరుకుంటున్న ముస్లింలు

కడప కల్చరల్ : మహమ్మద్ ప్రవక్తపై మహారాష్ట్రకు చెందిన మహరాజ్ అనే వ్యక్తి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం కడప నగరానికి చెందిన ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. ముస్లిం సంఘాలు, అన్ని రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. మహా ప్రవక్త మహ్మద్ కీర్తి, ప్రతిష్టలకు భంగం కలిగిస్తూ ఆర్ఎస్ఎస్ ప్రేరేపిత మహారాజ్ మహారాష్ట్రలో చేసిన అనుచిత వ్యాఖ్యలు ఇస్లాంకు వ్యతిరేకమైనవని, ముస్లింల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని ఆరోపించారు. ఆయనపై కేసు నమోదు చేయాలని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ విద్వేష పూరితమైన వ్యాఖ్యలకు కారకుడైన వ్యక్తిపై ఆ ప్రాంత ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, మైనార్టీ నేతలు అమీర్ బాబు, ఆరీఫుల్లా, బాబుభాయి, నజీర్ అహ్మద్, ముస్లిం మత గురువులు మహమ్మద్ అలీ బాగ్దాది, అబ్దుల్ రెహమాన్, జాకీర్ మౌలానా అబ్దుల్, అబ్దుల్ జబ్బార్, షామీర్ తదితరులు పాల్గొన్నారు.

'మాడభూషి' కవిత్వంలో సామాజిక స్పృహ



వక్త కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న అతిథులు

కడప కల్చరల్ : ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ కవిత్వమంతా సామాజిక స్పృహతో నిండి ఉందని ప్రముఖ కవి, విమర్శకులు కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 135వ సదస్సులో ఆయన 'ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ జీవితం–సాహిత్యం' అనే అంశంపై ప్రసంగించారు. 1989 నుంచి 12 సంవత్సరాలపాటు పత్రికా రంగంలో వివిధ హోదాల్లో పనిచేశారన్నారు. ఆయనలో కవితా పిపాస ఎక్కువని, తన స్పందనను వెంటనే అక్షర రూపంలోకి తేవడం ఆయన ప్రత్యేకతని వివరించారు. పేదల కష్టాలు, సామాన్యుల సమస్యలు, స్త్రీల దుఃఖాలు, సమాజంలో జరిగే దోపిడీలు, దేశభక్తి అంశాలపై ప్రతిభావంతంగా కవిత్వం వెలువరించారన్నారు. ఈ సందర్భంగా అతిథులు, బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య జి. పార్వతి వక్త కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డిని ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి, ఆచార్య రమాదేవిలతో కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొండ్రెడ్డి నాగిరెడ్డి, పి.వెంకటేశ్వరరెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, కొత్తపల్లె రామాంజనేయులు, బ్రౌన్ పరిశోధన కేంద్రం సలహా మండలి సభ్యుడు జానమద్ది విజయభాస్కర్, పల్లె విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అరటి పంట దగ్ధం



కాలిపోయిన అరటి పంట

కాశినాయన : మండలంలోని కె.ఎన్.కొట్టాల గ్రామానికి చెందిన లెక్కల బాలసుబ్బారెడ్డి అనే రైతుకు చెందిన 8 ఎకరాల్లోని అరటిపంట ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని కాలిపోయింది. దీంతో పాటు డ్రిప్‌వైర్లు, పైపులు కాలిపోవడంతో దాదాపు రూ.15 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. పోరుమామిళ్ల ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

విష ద్రావణం తాగిన మహిళ మృతి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలోని కర్చుకుంటపల్లి గ్రామానికి చెందిన ఆవిలి గుర్రమ్మ (45) అనే మహిళ ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ నరేష్ బాబు తెలిపారు. గుర్రమ్మ చిలంకూరు గ్రామంలో ఉన్న ఐసీఎల్ ఫ్యాక్టరీలో కాంట్రాక్ట్ కార్మికురాలిగా పనిచేసేది. ఈనెల 24వ తేదీన డ్యూటీకి వెళ్లి మధ్యాహ్నం 12 గంటలకు లంచ్ బ్రేక్‌లో బ్యాంకులో పని ఉందని చెప్పి కర్చుకుంటపల్లికి వచ్చింది. తర్వాత ఏదో ద్రావణం తాగి వాంతికి చేస్తుండగా చుట్టు పక్కల వారు గమనించి ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి బంధువులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పాము కాటుతో మహిళ మృతి

మదనపల్లె : పాముకాటుతో మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. చీకిల బైలు పంచాయతీ జమ్మికుంటపల్లి కు చెందిన రాజశేఖర్ భార్య కవిత(33) పొలం వద్ద పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో ఆమె అపస్మారక స్థితికి చేరుకోగా గమనించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

కళాశాల భూములను పరిశీలించిన దేవదాయ శాఖ అధికారి



కళాశాలకు చెందిన భూమిలో సాగు చేసిన పంటను పరిశీలిస్తున్న డీసీ గురుప్రసాద్

మైదుకూరు : మైదుకూరులోని శ్రీబాలశివయోగేంద్ర మహారాజ్ డిగ్రీ కళాశాలకు చెందిన భూములను ఆదివారం దేవదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ వట్టం గురుప్రసాద్ పరిశీలించారు. కళాశాలను ఏర్పాటు చేసి మైదుకూరు ప్రాంతంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్న హామీతో ఆలయ భూములను తీసుకొని కౌలుకు ఇచ్చారని కళాశాల యజమాని బాల శివయోగేంద్ర మహారాజ్‌పై ఫిర్యాదులు వెళ్లాయి. ఆ మేరకు దేవదాయ శాఖ డీసీ ఆదివారం పరిశీలనకు వచ్చారు. మైదుకూరులోని శ్రీమాధవ ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్ 1943/బీలో ఉన్న 16.94 ఎకరాల భూములను 40 ఏళ్ల కిందట బాల శివ యోగేంద్ర మహారాజ్ కళాశాల ఏర్పాటు కోసం కొనుగోలు చేశారు. అయితే తీసుకున్న భూముల్లో కేవలం నాలుగు ఎకరాల్లో మాత్రమే కళాశాలను ఏర్పాటు చేసి మిగిలిన భూములను కౌలుకు ఇచ్చారని ఆయనపై ఫిర్యాదులు వెళ్లాయి. తనకు ఫిర్యాదు అందడంతో భూములను పరిశీలించి, నిజానిజాలపై నివేదిక అందజేయాలని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశించడంతో ఆదివారం ఎండోమెంట్ డీసీ పరిశీలనకు వచ్చినట్టు తెలుస్తోంది. కళాశాలకు చెందిన భూముల్లో సాగు చేసిన పంటలను, నిర్వహిస్తున్న నర్సరీలను ఈ సందర్భంగా డీసీ గురుప్రసాద్ పరిశీలించారు. కళాశాలలో ఉన్న యజమాని బాల శివయోగేంద్రతో మాట్లాడారు. డీసీ వెంట దేవదాయ శాఖ కర్నూలు కార్యాలయం సూపరింటెండెంట్ తిరుమలరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరసింహాసింగ్, మైదుకూరు కార్యనిర్వహణాధికారి ప్రసాద్‌రావు ఉన్నారు.

వైఎస్సార్ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఎన్నిక



రవికుమార్



స్టాలిన్

వేంపల్లె : వైఎస్సార్ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎస్‌బీ రవికుమార్, కార్యదర్శిగా స్టాలిన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో టెన్నికాయిట్ క్రీడ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు. జిల్లా క్రీడాకారులను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తర్ఫీదు ఇస్తామన్నారు. ఈ ఎన్నికకు అన్నమయ్య జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మంజు పరిశీలకుడిగా వ్యవహరించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



మృతి చెందిన బద్వేలు నజీర్

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండల పరిధిలోని ఎర్రగుంట్ల–తిరుపతి బైపాస్‌రోడ్డులో బచ్చుంపల్లి వద్ద రోడ్డు దాటుతున్న బద్వేలు నజీర్ (27)ను గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. మృతుడిది వల్లూరు మండలం కాగా, ఇతను కడపలోని అప్సర సర్కిల్‌లో నివాసముంటుండే వాడు. సొంత పనుల నిమిత్తం బచ్చుంపల్లి వద్ద రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించామని చెన్నూరు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొని..



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

పులివెందుల రూరల్: పట్టణంలోని కదిరి ప్రధాన రహదారిలో ఆదివారం డివైడర్‌ను ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పులివెందుల వైపు నుంచి కదిరి రోడ్డు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం కదిరి ప్రధాన రహదారిలో డివైడర్‌ను ఢీకొంది. దీంతో వాహనం నడుపుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనానికి ఫోన్ చేసినా స్పందించక పోవడంతో అటు వైపు వెళ్తున్న కానిస్టేబుల్ విజయ్ ఆటోలో ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు





ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గొడుగునూరు గోపయ్య, గొడుగునూరు శివ

అట్లూరు : కడప–బద్వేలు ప్రధాన రహదారిపై షరాబుదిన్నె సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. బద్వేలు మండలం బోయనపల్లి గ్రామానికి చెందిన గొడుగునూరు గోపయ్య, గొడుగునూరు శివ ఇద్దరు ద్విచక్రవాహనం (స్కూటి)పై సిద్దవటం మండల బెటాలియన్ దగ్గర బంధువుల ఇంటిలో జరిగిన శుభకార్యానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా సిద్దవటం–అట్లూరు మండలాల సరిహద్దు అటవీ ప్రాంతంలో బద్వేలు డిపోకు చెందిన ఏపీ04జెడ్0316 నంబరు గల ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. సమీపంలో ఉన్న అటవీ ప్రొటక్షన్ వాచర్లు 108 వాహనానికి సమాచారం ఇచ్చి కడప రిమ్స్‌కు తరలించారు.

ఆధిక్యంలో చిత్తూరు జట్టు



వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానంలో తలపడుతున్న కర్నూలు-నెల్లూరు జట్లు



93 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మన్ నిఖిత్



83 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మన్ విజయ్‌రామిరెడ్డి



9 వికెట్లు తీసిన కర్నూలు బౌలర్ ఇస్మాయిల్



4 వికెట్లు తీసిన కడప బౌలర్ ఆదిల్ హుస్సేన్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 395 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు 102.1 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 450 పరుగులు చేసింది. జట్టులోని నిఖిత్ గౌడ్ 93 పరుగులు చేశాడు. కడప బౌలర్ ఆదిల్ హుస్సేన్ 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 64.5 ఓవర్లలో 245 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని విజయ్‌రామిరెడ్డి 83 పరుగులు చేశాడు. శేషాద్రినాయుడు 25 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్లు రెడ్డిప్రకాష్ 5, డానియల్ దాస్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 13 పరుగులు చేసింది. దీంతో రెండోరోజు ఆట ముగిసే సమయానికి చిత్తూరు జట్టు 218 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

హోరాహోరీగా కర్నూలు, నెల్లూరు మ్యాచ్..

వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 87 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నెల్లూరు జట్టు 35.2 ఓవర్లలో 174 పరుగుల వద్ద ఆలౌట్ అయింది.

జట్టులోని భార్గవ్ 52 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ ఇస్మాయిల్ 9 వికెట్లతో రాణించాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 48.1 ఓవర్లలో 237 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని మనోజ్‌రాజు 86 పరుగులు, ఇస్మాయిల్ 51 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. నెల్లూరు బౌలర్ సుతేజ్‌రెడ్డి 4 వికెట్లు తీశాడు. 323 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 51 పరుగులు చేసింది. జట్టులోని అబ్బాస్ 31, సోహన్ వర్మ 15 పరుగులు చేశారు. దీంతో రెండోరోజు ఆట ముగిసింది. కాగా కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 259 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.